సాక్షి
అనంతపురం
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.37,280

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,280 పలికాయి.



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి ధర రూ.11 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/17.9°

జిల్లా అంతటా మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 4 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 29.8-32.6, రాత్రి ఉష్ణోగ్రతలు 20.0-20.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 80-85 శాతం, మధ్యాహ్నం 48-63 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు మంగళవారం నిలకడగా సాగాయి. మార్కెట్‌కు 164 మంది రైతులు 195.40 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకొచ్చారు. మొదటి రకం క్వింటాలు రూ.17 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం రూ.7 వేలు ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే ధరలు కాస్త పెరిగి నిలకడగా ఉన్నాయని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో బాలిక కిడ్నాపర్?

మడకశిర: బేగార్లపల్లికి చెందిన బాలిక కిడ్నాప్ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని బాలికను రక్షించినట్లు సమాచారం. అయితే పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. బాలిక మూడు రోజుల క్రితం కిడ్నాప్‌నకు గురైన సంగతి తెలిసిందే. కుమార్తెను రక్షించాలని తల్లిదండ్రులు సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. విచారణలో జరుగుతున్న జాప్యానికి మనస్తాపం చెందిన బాలిక తల్లిదండ్రులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో పోలీసులు విచారణను వేగవంతం చేసి కిడ్నాపర్‌ను పట్టుకుని, బాలికను రక్షించినట్లు తెలిసింది. కిడ్నాపర్ అదే గ్రామానికి చెందిన వ్యక్తి అని సమాచారం.

ఐసీడీఎస్ పీడీగా వనజాఅక్కమ్మ



అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా వనజాఅక్కమ్మ నియమితులయ్యారు. ప్రస్తుతం కంబదూరు సీడీపీఓగా పనిచేస్తున్న ఈమెకు పదోన్నతి కల్పిస్తూ ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వనజా అక్కమ్మ 1990లో సూపర్‌వైజర్‌గా మహిళా, శిశు సంక్షేమశాఖలో ప్రస్థానం ప్రారంభించారు. 1999లో సీడీపీఓగా పదోన్నతి పొందారు. హిందూపురం, గుత్తి, శింగనమల, అనంతపురం అర్బన్, కంబదూరు సీడీపీఓగా పనిచేశారు. తల్లిపాల వారోత్సవాలను మొదటిసారిగా జిల్లాలో ప్రారంభించి 2009లో జాతీయస్థాయి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. అనంతరం వరుసగా రెండుసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు పొందారు. ఉత్తమ ప్రాజెక్టుగా శింగనమలకు పేరు తీసుకొచ్చారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఉత్తమంగా అమలు చేసినందుకు 2014లో రాష్ట్రస్థాయి, 2019లో జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. తాజాగా ఆమెకు పదోన్నతి కల్పించి రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు.

టీడీపీ కార్యకర్తల బాహాబాహీ

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం టీడీపీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. గ్రామంలో ఉదయం తహసీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. మధ్యాహ్నం అధికారులు భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు యల్లాపుల రామన్న అలియాస్ రమణపై దాదా, జాకీర్, రసూల్‌తో పాటు మరో ఇద్దరు పరస్పర దాడికి పాల్పడ్డారు. రామన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలో రేషన్‌షాపు నిర్వహణ అంశంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే దాడులు చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఫుల్లుగా కమీషన్ల కిక్కు



అనంతపురంలోని మద్యం డిపో

మద్యం డిపోలో వసూళ్ల మాఫియా

- కమీషన్ ఇస్తే అడిగినంత సరుకు సరఫరా
- కాదు..లేదు అంటే కోతలు
- ఒక్కో వైన్ షాపు నుంచి నెలకు రూ.5 వేల మేర కప్పం
- మద్యం కేస్‌లు ఓపెన్ చేసి చూపించరు.. లీకేజీ ఉంటే భరించాల్సిందే
- లబోదిబోమంటున్న షాపుల నిర్వాహకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పుష్ప సినిమా తరహాలో సిండికేట్‌గా మారి మద్యం షాపుల పర్మిట్ల కోసం ఇటీవల టీడీపీ నేతలు పోటీపడ్డారు. ఆ తర్వాత బెల్టుషాపులు, పర్మిట్ రూముల పేరుతో విచ్చలవిడిగా మద్యం అమ్మిస్తున్నారు. ఇప్పటి వరకూ పాలకుల ఆగడాలు ఒకెత్తయితే అవినీతిలో తామేం తక్కువ అన్నట్లు మద్యం డిపోను వసూళ్లకు అడ్డాగా మార్చారు కొందరు ప్రబుద్ధులు. డిస్టిలరీల నుంచి వచ్చే మద్యాన్ని సజావుగా, సక్రమంగా సరఫరా చేయాల్సిన డిపో అక్రమాలకు నిలయంగా మారింది. డిపో మేనేజర్, ఇతర సిబ్బంది సిండికేట్‌గా మారి వసూళ్లకు తెరలేపారు. డిపోలో అధికారుల తీరుకు నిరసనగా జిల్లాలోని వైన్ షాపుల నిర్వాహకులు, బార్‌ల యాజమాన్యాలు ధర్నాకు దిగాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

మామూళ్లిస్తే కావాల్సినంత మద్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రమారమి 230 వైన్ షాపులు ఉన్నాయి. వీరిలో ఎవరైనా సరే డిపోకెళ్లి అడిగినంత సరుకు కావాలంటే మామూళ్లిచ్చుకోవాల్సిందే. లేదంటే రేషన్ తరహాలో కోత వేస్తున్నారు. ముఖ్యంగా చీప్‌లిక్కర్, బీర్‌ల విషయంలో ఇలా వ్యవహరిస్తున్నారు. కొన్ని ఫాస్ట్ మూవింగ్ బ్రాండ్ల (బాగా అమ్ముడయ్యే మద్యం) విషయంలోనూ ఎక్కువగా కోత ఉంది. అధికార పార్టీకి చెందిన కొంతమందికి మాత్రం రాత్రి పూట మద్యం లోడ్ చేసి పంపిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం కొందరు బార్‌ల యజమానులు డిపోకు వెళ్లి అక్కడి అధికారుల అవినీతిపై మండిపడ్డారు. తాము డబ్బు కడతామంటే సరుకు ఎందుకివ్వరని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అవినీతి కంపు..

గత ప్రభుత్వ హయాంలో మద్యం డిపోపై ఎప్పుడూ చిన్న ఫిర్యాదు కూడా లేదు. కానీ కూటమి సర్కారు వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీ తెచ్చింది. దీంతో మద్యం డిపో అవినీతి కూపంలో కూరుకుపోయింది. ఒక్కో వైన్‌షాపు నెలకు రూ.5 వేల మేర డిపో అధికారులకు చెల్లించాల్సిందేనని రేటు ఫిక్స్ చేశారు. లేదంటే అడిగినంత సరుకు ఇచ్చేది ఉండదు. మద్యం కేస్‌లను ఓపెన్ చేసి చూపించడం లేదని, బాటిళ్ల లీకేజీ ఉంటే ఆ ఖర్చు వైన్‌షాపు నిర్వాహకులే భరించుకోవాల్సి వస్తోందని తెలిసింది. మద్యం ఇండెంట్‌లలో ఒక్కో బిల్లుకు రూ.250 చెల్లించాల్సిందే. రోజూ బిల్లు చేయించుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. రోజుకు 300కు పైగా బిల్లులు జనరేట్ అయితే, ఇందులో ఒక్కో బిల్లుకు రూ.250 చొప్పున రోజుకు రూ.75 వేలు అనధికారికంగా ఇవ్వాలి. డిపో మేనేజర్ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలతో కూటమి సర్కారు తెచ్చిన మద్యం పాలసీ అభాసుపాలవుతోంది.

మద్యం డిపోలో ఒక నెలలో మామూళ్ల పరిస్థితి ఇలా..

జిల్లాలో వైన్ షాపులు	230
ఒక్కో షాపు నుంచి	రూ.5,000
ఒక్కో బార్ నుంచి	రూ.5,000
ఒక్కో బిల్లుకు	రూ.250
బిల్లు స్కానింగ్‌కు	రూ.100
బిల్లు ప్రింట్‌కు	రూ.100
హమాలీల పేరిట	రూ.200
వైన్ షాపుల నుంచి మొత్తం	రూ.11,50,000
బార్‌ల నుంచి	రూ.1,05,000

ఒక్కో ఫిర్యాదునూ పరిష్కరిస్తున్నాం

డిపోలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఒక్కో ఫిర్యాదునూ పరిష్కరిస్తూ వస్తున్నాం. నెలకు రూ.5 వేలు తీసుకోవడం లేదు. హమాలీల అజమాయిషీ మా చేతుల్లో లేదు. కొన్ని సరిహద్దు షాపులకు కాస్త ఎక్కువ మద్యం ఇవ్వాలనేది ఉంది. అందుకే ఇస్తున్నాం. నేను కూడా కొత్తగా వచ్చాను. అన్నీ పరిశీలిస్తున్నా.
–డా.బి.వెంకటనాయుడు, మద్యం డిపో మేనేజర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్, కేజీబీవీ పాఠశాలతో పాటు నార్పల మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సంగీతకుమారి, నాగవేణి, ఎంఈఓ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాడుబడిన భవనాల్లో అంగన్‌వాడీలా?

తాడిపత్రి టౌన్/రూరల్: పాడుబడిన భవనాల్లో అంగన్‌వాడీ కార్యకలాపాలు నిర్వహించడం తగదని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. తాడిపత్రి మండలంలోని చుక్కలూరు హైస్కూల్‌తో పాటు అంగన్‌వాడీ సెంటర్‌ను, పట్టణంలోని జయనగర్ కాలనీ, నందలపాడులోని జూటూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పిల్లల కడుపు కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. భవనాల్లో మరమ్మతులు చేపట్టకపోవడంపై స్పందించారు. వేరే చోట్లకు మార్చాలని సిబ్బందికి సూచించారు. అయితే, రూ. 6 వేలు బాడుగ ఇస్తామన్నా కాలనీల్లో భవనం దొరకడం లేదని అంగన్‌వాడీ అధికారులు ఆయనకు చెప్పడంపై స్థానికులు అవాక్కయ్యారు. పైగా, చైర్మన్ రాక గురించి రెండు రోజుల ముందే తెలియడంతో ఎన్నడూ లేని విధంగా పిల్లలను, బాలింతలను, గర్భిణులను తరలించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్ బాబు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేసే దాకా పోరు

- 13న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- రైతన్నకు మద్దతుగా ప్రతి ఒక్కరూ తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు
- ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని స్పష్టీకరణ



ర్యాలీకి సంబంధించిన పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ నేతలు విశ్వ, రంగయ్య, వీరా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం కుదేలైందని, సీఎం చంద్రబాబు స్పందించి రైతులకు న్యాయం చేసే దాకా తాము పోరుబాట సాగిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, శింగనమల సమన్వయకర్త వీరాంజ నేయులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులతో కలసి ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. అన్నదాతలకు అండగా నిలబడేందుకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోరుబాటకు పిలుపునిచ్చారన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కల్గించడమే లక్ష్యంగా ఈ నెల 13న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురం జెడ్పీ కార్యాలయం ముందున్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగుతుందని, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు,నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే భారీ ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేడు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అతివృష్టి,అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కాక దళారులు, మిల్లర్లకు నష్టాలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మద్దతు ధరతో రైతులను ఆదుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచమంటూనే అమాంతంగా పెంచేసి ప్రజలపై రూ.వేల కోట్ల భారం మోపారన్నారు. నేటికీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు.

అన్నదాతల దగా..

ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ తదితర పథకాలు అమలు చేయకుండా వంచించడమే కాకుండా ఇన్సూరెన్స్ భారం మోపి దగా చేస్తోందన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్ల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదన్నారు. పార్టీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ ఉంతకల్లు రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చాగల్లు, జీడిపల్లి రిజర్వాయర్ కింద రైతాంగానికి ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చి వారిని ఆదుకోవాలన్నారు. బీటీపీ ప్రాజెక్టుకు సంబంధించి 114 చెరువులకు నీరందించే పనులు చేపట్టాలన్నారు. కాలువల సామర్థ్యం పెంచేందుకు హెచ్‌ఎల్‌సీ ఆధునీకరణ చేపట్టాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ రైతులను మాత్రమే కాకుండా అన్ని వర్గాలనూ సీఎం చంద్రబాబు దగా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్, పంచాయతీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు మీసాల రంగన్న, మాల్యవంతం మంజుల, చింతకుంట మధు, కేవీ రమణ, అమర్‌నాథ్‌రెడ్డి, రాధాకృష్ణ, ఖాజా, కార్పొరేటర్లు కమల్ భూషణ్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్మాణం పూర్తిచేయాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: వసతి గృహాల నిర్మాణ, మరమ్మతు పనులు సంక్రాంతిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్య,అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 హాస్టళ్లకు జిల్లా మినరల్ ఫండ్ కింద రూ.1.12 కోట్ల నిధులు ఇచ్చామన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం రూ.5.70 కోట్లు మంజూరు చేసిందని, ఏపీఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ద్వారా 36 వసతి గృహాల్లో పనులన్నీ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. వసతి గృహాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా పరిషత్ నుంచి కేటాయించిన నిధులను అన్ని నియోజకవర్గాలకు సమాన నిష్పత్తిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ ప్రతాప్‌సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం నాగరాజు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మైనారిటీ సంక్షేమాధికారి రామసుబ్బారెడ్డి, ఇతర సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూభవన్‌లో లిఫ్ట్

వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల సౌకర్యార్థం రెవెన్యూభవన్‌లో లిఫ్ట్ సదుపాయం కల్పించామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. లిఫ్ట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు, ఇతరత్రా రోజుల్లో జరిగే కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చే వృద్ధులు, నడవలేనివారు, దివ్యాంగులు, గర్భిణులు మెట్లు ఎక్కి రెవెన్యూభవన్‌లోకి రావడానికి ఇబ్బందికి గురవుతుండడంతో లిఫ్ట్ సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పేనాయక్, తదితరులున్నారు.

విజయవాడకు కలెక్టర్

అనంతపురం అర్బన్: కలెక్టర్లతో ముఖ్యమంత్రి నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. బుధ, గురువారం రెండు రోజుల పాటు కాన్ఫరెన్స్ జరగనుంది. జిల్లా అభివృద్ధికి సంబంధించి నివేదికను ఈ సందర్భంగా కలెక్టర్ సమర్పించనున్నారు. ఆయన ఈనెల 13న తిరిగి విధులకు హాజరవుతారని కార్యాలయ అధికారవర్గాలు తెలిపాయి.

పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలి

ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ భవనంలో ప్రచార ఆధారిత కార్యక్రమాలు, ప్రజా విధానంలో ఆర్‌టీజీఎస్ నిరంతర పర్యవేక్షణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాట్సాప్, మీడియా, టీవీలు, సోషల్ మీడియాలో ప్రతికూల వార్తలు లేదా ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తమై సమస్యలను పరిష్కరించాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, నగర పాలక కమిషనర్ నాగరాజు, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

- గర్భం దాల్చడంతో ఆస్పత్రిలో చికిత్స
- నిందితుడిపై పోక్సో, రేప్ కేసు నమోదు



గార్లదిన్నె: మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగింది. ఆమె గర్భం దాల్చడంతో విషయం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముంటిమడుగుకు చెందిన వంశీ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజూ కల్లూరు నుంచి వ్యవసాయ కూలీలను పనుల నిమిత్తం వ్యానులో తీసుకుని వెళ్లి.. మళ్లీ సాయంత్రం పని ముగిసిన తరువాత గ్రామానికి తీసుకొచ్చేవాడు. ఈ క్రమంలో బాలికతో వంశీ పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు.పలుమార్లు అత్యాచారం చేశాడు. పదో తరగతి వరకు చదివిన బాధిత బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ రోజూ వ్యవసాయ పనులకు వెళ్లేది. సోమవారం అర్ధరాత్రి కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకుంది. నీరసంగా ఉండి కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఏడు నెలల గర్భిణి అని నిర్ధారించారు. ఈ క్రమంలోనే వైద్యుల సూచన మేరకు బాలికను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడు వంశీపై పోక్సో, రేప్ కేసులు నమోదు చేశారు.

అలరించిన మాతృదేవోభవ

ప్రశాంతి నిలయం: తల్లిని పూజించే ప్రతి మనిషీ సర్వోన్నతులవుతారన్న సందేశాన్నిస్తూ చిన్నారులు నిర్వహించిన 'మాతృదేవోభవ' నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తి యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. మంగళవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి సన్నిధిలో గుంటూరు జిల్లా బాలవికాస్ చిన్నారులు 'మాతృదేవోభ' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు.





మాతృ దేవోభవ నృత్యరూపకంలోని ఘట్టాలు

అశాస్త్రీయం.. అసంబద్ధం

- కూటమి సర్కార్ మరో వివాదాస్పద నిర్ణయం
- సీఐడీ కేసుల విచారణ కర్నూలులోని ఏసీబీ కోర్టుకు బదలాయింపు
- భగ్గుమంటున్న న్యాయవాదులు

అనంతపురం: వికేంద్రీకరణతో సత్వర న్యాయం, సమానమైన అవకాశాలు, పాలనలో పారదర్శకత, అందరికీ సంక్షేమ ఫలాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధి జరుగుతుంది. కానీ ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం కేంద్రీకరణ దిశగా శరవేగంగా పావులు కదుపుతోంది. గంజాయి, ఎర్రచందనం రవాణా వంటి కేసుల విచారణ, తీర్పును వెలువరించే అనంతపురం అదనపు జిల్లా మెజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని (ఎన్‌డీపీఎస్ కోర్టును) తిరుపతికి బదలాయించి అక్కడ ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా న్యాయవాదులు పోరుబాట పట్టారు. ఇంతలోనే సీఐడీ కేసుల విచారణను కర్నూలులోని ఏసీబీ కోర్టుకు బదలాయిస్తూ తాజాగా మంగళవారం జీఓ జారీ చేసింది. దీంతో రెండు కోర్టుల తరలింపును న్యాయవాదులు ఆక్షేపిస్తూ కూటమి సర్కార్ నియంతృత్వ పోకడలపై మండిపడ్డారు. ఈ రెండు కోర్టులు యథాతథంగా జిల్లాలోనే కొనసాగించే వరకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

4,500 మందికి తప్పని ఇక్కట్లు

సీఐడీ కేసులను ఇప్పటి వరకూ జిల్లా కోర్టులోనే విచారణ నిర్వహించి, దోషులకు శిక్షలు విధించేవారు. తాజాగా రాయలసీమ ప్రాంతంలోని కేసులన్నింటినీ కర్నూలు కోర్టులోనే విచారణ చేపట్టాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి, చిత్తూరు, నంద్యాల జిల్లాలతో పాటు కర్నూలు జిల్లా కేసుల విచారణ మొత్తం కర్నూలు కోర్టులోనే చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వ్యవహారాలన్నీ అధికమై, కేసుల విచారణలో అంతులేని జాప్యం చోటు చేసుకునే ప్రమాదముంది. ఇప్పటికే కేసుల విచారణలో కక్షిదారులు వాయిదాలు తిరగలేక పోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నకిలీ పాసుపుస్తకాల వ్యవహారానికి సంబంధించి వాదనలు సీఐడీ కోర్టులోనే సాగుతున్నాయి. ఈ ఒక్క వ్యవహారంలోనే దాదాపు 4,500 మంది రైతులు ఉన్నారు. వీరంతా వాయిదాలకు ఉమ్మడి జిల్లా మారుమూల ప్రాంతం నుంచి కర్నూలుకు వెళ్లాలంటే ముందు రోజే వెళ్లాల్సి ఉంటుంది. వాయిదా చూసుకుని మరుసటి రోజు స్వగ్రామాలకు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో కక్షిదారులు, జామీన్లు వేసే వారు, పోలీసులకు ఇదో తలనొప్పిగా మారనుంది.


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అవకాశాలు కోల్పోనున్న న్యాయవాదులు

రెండు కోర్టులు తరలిపోవడంతో జిల్లా న్యాయవాదుల ఉపాధి అవకాశాలపై భారీగా గండిపడింది. కక్షిదారులు ఆ ప్రాంత న్యాయవాదులను సంప్రదించాలంటే చాలా కష్టపడాల్సి వస్తోంది. ప్రధానంగా ఈ కేసులన్నీ జూనియర్ న్యాయవాదులే వాదిస్తుంటారు. వృత్తిలో స్థిరపడడానికి వారికి కనీసం రెండు, మూడు సంవత్సరాలు పడుతుంది. ఈ కాలంలో న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున స్టైఫండ్‌ను గత ప్రభుత్వం ఇచ్చి ఆదుకుంది. కూటమి ప్రభుత్వంలో కనీసం స్టైఫండ్ ఇవ్వలేదు. పైగా కోర్టులను తరలించి బతుకు తెరువు లేకుండా చేస్తోందని లాయర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ న్యాయవాదులు నష్టపోతారు



అనంతపురం కోర్టులో సీఐడీ కేసులు 110 దాకా ఉన్నాయి. ముఖ్యంగా భూమి పాసుపుస్తకాలకు సంబంధించిన కేసులే అధికం. సామాన్య రైతులు చాలా మంది ఈ కేసులో కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా ఈ కేసులన్నీ జూనియర్ న్యాయవాదులు వాదిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వీరంతా కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది. కోర్టు తరలింపుతో జూనియర్ న్యాయవాదులు పెద్ద ఎత్తున నష్టపోతారు. కక్షిదారులకు ఆర్థిక భారమైన ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలి. న్యాయవాదుల సంక్షేమాన్నీ దృష్టిలో ఉంచుకోవాలి.

– సూర్యచంద్రయాదవ్, ఆలిండియా లాయర్స్ యూనియన్ సభ్యులు

కేసుల విచారణ జాప్యం



ఒక కోర్టు నుంచి మరొక కోర్టుకు కేసుల తరలింపుతో విచారణలో అంతులేని జాప్యం చోటు చేసుకుంటుంది. సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టడానికి వీలు కాదు. రికార్డులు సక్రమంగా సమర్పించకపోవడం వంటి సమస్యలూ తలెత్తుతాయి. అనంతపురం కోర్టులోనే ఎన్‌డీపీఎస్, సీఐడీ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసిన రెండు జీఓలను వెంటనే రద్దు చేయాలి.

– గాజుల ఉమాపతి, వైఎస్సార్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు.

రెండు కోర్టులను యథాతథంగా ఉంచాలి

అనంతపురం: సీఐడీ కోర్టును కర్నూలులోని ఏసీబీ కోర్టుకు, గంజాయి, తదితర మాదక ద్రవ్యాల కేసుల విచారణను జిల్లా అదనపు కోర్టు నుంచి ప్రత్యేక కోర్టులకు బదలాయించడంతో పాటు, తిరుపతిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయడంపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన జీఓలను రద్దు చేయాలంటూ అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న న్యాయవాదులకు సీపీఐ నేత నారాయణస్వామి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కాసాని నాగరాజు, అంకె కుళ్లాయప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరిప్రసాద్, జిలాన్‌బాషా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ కోర్టును అనంతపురం నుంచి తిరుపతికి తరలించి పట్టుమని పది రోజులైనా గడవక ముందే సీఐడీ కోర్టును కర్నూలుకు తరలించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. దీంతో న్యాయవాదులకు, కక్షిదారులకు, అందరికీ ఇబ్బందులేనని పేర్కొన్నారు. ఇది వరకు అనంతపురం అదనపు జిల్లా జడ్జి పర్యవేక్షణలో ఉన్న ఎన్‌డీపీఎస్ కోర్టును తిరుపతికి తరలించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ పోరాటం చేస్తున్న న్యాయవాదులకు సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. సీనియర్ న్యాయవాది హనుమన్న మాట్లాడుతూ.. రెండు కోర్టులను తరలించడం వల్ల కేసుల విచారణలో ఎక్కువ జాప్యం చోటుచేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షలో సీనియర్ న్యాయవాదులు సి.హనుమన్న, నార్పల శ్రీధర్, వి.కేశవయ్య, ఇతర న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్దేశిత లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలి


పాతకొత్తచెరువులో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఉపాధి హామీ పథకం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు, కసాపురం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పాతకొత్తచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కసాపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల (ఇంకుడు గుంత)ను పరిశీలించారు. వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి నీటి చుక్కను వినియోగించుకునేలా రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఫారంపాండ్లు, పశువుల షెడ్ల నిర్మాణం పనులూ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఆదేశించారు.

ఉరవకొండలో వరుస చోరీలు


సోమ్లానాయక్ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఉరవకొండ: వరుస దొంగతనాలతో దొంగలు హల్‌చల్ చేశారు. వివరాలు... ఉరవకొండ పట్టణంలోని రంగావీధిలో నివాసముంటున్న విశ్రాంత రైల్వే ఉద్యోగి సోమ్లానాయక్ ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉన్న తన కుమారుడు వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లాడు. మంగళవారం వేకువజామున దుండగులు ఆ ఇంటి తాళాన్ని బద్దలు చేసి లోపలకు ప్రవేశించి, బీరువాలో ఉన్న 10 తులాల బంగారు నగలు, రూ.50వేల నగదు అపహరించారు. అనంతరం అదే ఇంటిపై భాగంలో నివాసముంటున్న టైలర్ వన్నూరుస్వామి ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి తులం బంగారం, రూ.10 వేలు అపహరించుకెళ్లారు. కాగా, వన్నూరుస్వామి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి గుంతకల్లుకు వెళ్లినట్లుగా తెలిసింది. మంగళవారం ఉదయం తాళాలు బద్దలుగొట్టిన విషయాన్ని గుర్తించిన పొరుగింటి వారి ద్వారా విషయం తెలుసుకున్న బాధితుల సమాచారం మేరకు సీఐ మహానంది, ఎస్‌ఐ జనార్దననాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కారు దగ్ధం


పూర్తిగా కాలిపోయిన కారు

ఆత్మకూరు: మండల పరిధిలోని జాతీయ రహదారి 544డీడీ పై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఓ కారు పూర్తిగా కాలిపోయింది. వివరాలు... ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామానికి చెందిన మల్‌రెడ్డి సోమవారం అర్ధరాత్రి అత్యవసర పనిపై కారును సొంతంగా నడుపుకుంటూ అనంతపురానికి బయలుదేరాడు. ఆత్మకూరు–వడ్డుపల్లి మార్గంలోని హంద్రీ–నీవా కాలువ సమీపంలో జాతీయ రహదారి 544డీడీపై ప్రయాణిస్తుండగా ఉన్నఫళంగా ఓ హెడ్‌లైట్ ఆఫ్ అయింది. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి లైట్‌ను సరిచేసేందుకు కారు బ్యానెట్ తెరుస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. అప్రమత్తమైన మల్‌రెడ్డి పక్కకు దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మంటలు ఆర్పేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ లోపు కారు పూర్తిగా కాలిపోయింది. కాగా, ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.

యువకుడి బలవన్మరణం

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన కుండ రామన్న కుమారుడు గంగాధర్ (28) వ్యవసాయ కూలి పనులతో ఇంటికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొన్ని రోజుల క్రితం తల్లి అంజినమ్మ ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కుదేలైన గంగాధర్ కూడా రెండు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాయదుర్గం రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వేకువజామున పట్టాల మధ్య పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించిన గ్యాంగ్‌మెన్ సమాచారంతో గుంతకల్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శర్మాస్‌బీ

ఉరవకొండ: స్థానిక 5వ సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేస్తున్న శర్మాస్‌బీ ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గత రెండేళ్లుగా ఎంఎల్‌హెచ్‌పీ సులోచన వేధిస్తోందని, ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తీవ్ర మనస్తాపం చెంది వివిధ రకాల మాత్రలను శర్మాస్‌బీ మింగిందని పోలీసులకు భర్త శర్మష్ ఫిర్యాదు చేశాడు. విధుల్లో ఉన్న తన భార్యపై పలు మార్లు ఆమె చెయ్యి కూడా చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమె వేధింపులు తాళలేక సచివాలయంలోనే వివిధ రకాల మాత్రలను ఆమె మింగినట్లు వివరించాడు. కాగా, చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబన్న హత్యకేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు. చిత్తూరు జిల్లా వెంకటపాలెం వద్ద ఉన్న గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న నడిపి కంబన్న ఈ నెల 1న స్వగ్రామంలో డప్పు కళాకారుల పింఛన్ తీసుకునేందుకు వచ్చాడు. అనంతరం ఈ నెల 7న వెంకటపాలెం వెళ్లేందుకు తాడిపత్రిలోని రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. మార్గ మధ్యంలో నందలపాడు వద్ద వైన్స్ షాప్‌లో మద్యం కొనుగోలు చేస్తున్న సమయంలో పుట్లూరు గ్రామానికి చెందిన చిన్న కంబగిరి పరిచయమయ్యాడు. ఇద్దరు కలసి నాలుగు క్వాటర్ల మద్యం కొనుగోలు చేసి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తాగారు. కాసేపటి తర్వాత ప్లాట్‌ఫారం వెనుక మూత్ర విసర్జన చేస్తున్న కంబన్న తలపై పెద్ద రాయితో కంబగిరి మోది హతమార్చాడు. అనంతరం హతుడి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. ఘటనపై తొలుత అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో హత్యగా నిర్ధారించుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం టీటీడీ కల్యాణమంటపం సమీపంలో తచ్చాడుతున్న చిన్నకంబగిరిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య చేసిన వైనాన్ని వివరించాడు. నిందితుడి వద్ద నుంచి హతుడి సెల్‌ఫోన్, రూ.300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దేశంలో మానవహక్కుల ఉల్లంఘన

- మహిళలు, బాలికలపై పెరిగిన అత్యాచారాలు
- పౌర చైతన్య వేదిక ప్రదర్శనలో వక్తలు


ప్రదర్శన నిర్వహిస్తున్న పౌర చైతన్య వేదిక నాయకులు

అనంతపురం అర్బన్: 'దేశంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది. ప్రజాస్వామిక హక్కులు, లౌకికవాదం, మానవహక్కులను ప్రస్తుత పాలకులు హరిస్తున్నారు. మరోవైపు మహిళలు, బాలికలు, పిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయి' అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, మానవ హక్కుల వేదిక జిల్లా ఇన్‌చార్జి డి.రాఘవేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినం సందర్భంగా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు, రాఘవేంద్ర మాట్లాడారు. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన ప్రతి రంగంలోనూ కనిపిస్తోందన్నారు. అదే క్రమంలో అత్యాచారాలు పెరిగాయన్నారు. ప్రభుత్వాలు ప్రజల గొంతును నొక్కేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. యూఏపీఏ వంటి చట్టాల పేరిట అరెస్టులు, సీబీఐ విచారణలు, ఈడీ దాడులతో భయాందోళనలకు గురిచేస్తున్నాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత కాలానుగుణ మార్పుల పేరిట దుర్మార్గమైన నియమాలను కొనసాగిస్తుండడపై ఆందోళన వ్యక్తం చేశారు. మానవ హక్కుల ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక నాయకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు, నరేంద్ర, విద్యార్థి, యువజన, మహిళ సంఘాల నాయకుల పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా నిలుద్దాం

- ఈ నెల 13న జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయండి
- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపు



ఉరవకొండ: రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రకరూరు మండలంలోని కొనకొండ్లలో ఉన్న తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలవుతున్నా రైతాంగానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో పంటల సాగుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేల ఇస్తామన్న చంద్రబాబు... ఈ ఆరు నెలల కాలంలో ఏ ఒక్క రైతుకూ ఇవ్వలేదన్నారు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించలేదన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13న అనంతపురంలో తలపెట్టిన రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వృద్ధురాలి ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(60) ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కొన్ని నెలలుగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని విష ద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య

శింగనమల: గ్రామ పంచాయతీల్లో పని చేసే పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమని జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య కొనియాడారు. మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను ఆయన సన్మానించి, మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులు ఎవరూ చేయలేరన్నారు. వారి పని తీరు వల్లనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. వారి సేవలకు వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన తలారి జ్యోతి తన ఇద్దరు పిల్లలతో సహా కనిపించకుండా పోయింది. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం రాత్రి జ్యోతి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

పకడ్బందీగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు

- జేసీ శివనారాయణ శర్మ



అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన జిల్లా కో–ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్) గోడౌన్ల నిర్మాణం, సీఎస్‌సీ సెంటర్లు, జన ఔషధి కేంద్రాలు, సహకార్ సే సమృద్ధి, ఎరువుల వ్యాపారం, తదితర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాల అమలు ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారనే విషయంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీసీసీబీ సీఈఓ సురేఖరాణి, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, డీఎల్‌సీఓ ప్రభాకరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం అమ్మాలి

గార్లదిన్నె: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. గార్లదిన్నె మండలం కల్లూరులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వరి ధాన్యం క్వింటాకరు రూ.2,300 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముండడంతో రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీ రవి, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

గార్లదిన్నె: భూసమస్యలు పరిష్కారించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. గార్లదిన్నె మండలం కేశవాపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ భూసమస్యలు ఉంటే సదస్సుల్లో అధికారులకు విన్నవించి శాశ్వత పరిష్కారం పొందవచ్చునన్నారు. అనంతరం గ్రామంలో అందిన ఏడు వినతులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిపై జేసీ కక్ష సాధింపు చర్యలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి కక్ష సాధింపు చర్యలు తారాస్థాయికి చేరుకున్నాయి. నిన్నటి వరకూ రమేష్‌రెడ్డి చేపట్టిన నూతన గృహ నిర్మాణ పనులను అడ్డుకుంటూ వచ్చిన జేసీ ప్రభాకరరెడ్డి తాజాగా, మంగళవారం జేసీబీని ఏర్పాటు చేయించి కూలదోయించారు. దీంతో మంగళవారం టీటీడీ కల్యాణ మంటపం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న రమేష్‌రెడ్డి అక్కడకు చేరుకుని మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఆక్రమణలు ఏమైన గుర్తిస్తే ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేయడమేమిటంటూ ప్రశ్నించారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకరరెడ్డి దౌర్జన్యాలకు ప్రజలు భయపడే పరిస్థితి నెలకొందన్నారు.


కట్టడాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

దళితుడి ప్రాణం విలువ రూ.3 లక్షలు!


న్యాయం చేయాలంటున్న బాధిత కుటుంబసభ్యులు

రాయదుర్గం: నిరుపేద దళితుడి ప్రాణం విలువ రూ.3 లక్షలుగా దుప్పటి పంచాయితీలో పెద్దలు నిర్ణయించారు. మృతుడి భార్య గౌరమ్మ, నలుగురు చిన్నారులకు తండ్రి ఆస్తిగా ఈ చిరుసాయాన్ని అందించి చేతులు దులుపుకున్నారు. వివరాలు... రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామానికి చెందిన హరిజన మద్దానప్ప (37)... సినీ హీరో అల్లు అర్జున్‌కు వీరాభిమాని. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పుష్ప–2 సినిమా చూసేందుకు సోమవారం రాయదుర్గం వచ్చిన ఆయన థియేటర్‌లోనే అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. దీనిపై బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేయడంతో రాత్రి 11 గంటల తర్వాత కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో థియేటర్‌లోనే దుప్పటి పంచాయితీ నిర్వహించారు. చివరకు రూ.3 లక్షలు బాధిత కుటుంబానికి థియేటర్ యజమాని చెల్లించేలా ఒప్పించారు. ఇందులో రూ.2 లక్షలను అప్పటికప్పుడు యజమాని చెల్లించాడు. మిగిలిన రూ.లక్షను మంగళవారం ఇచ్చేలా ఒప్పందం చేశారు. తమకు న్యాయం చేయాలని మృతుడి కుటుంబసభ్యులు ఎంత ప్రాధేయపడినా... పంచాయితీ పెద్దలు పెడచెవిన పెట్టి, చిరు సాయాన్ని చేతిలోపెట్టి దాటవేశారు. కూలి పనులతో నలుగురు పిల్లలను ఎలా పోషించుకోవాలో తనకు అర్థం కావడం లేదంటూ మృతుడి భార్య గౌరమ్మ బోరున విలపించింది. ప్రభుత్వం తరఫున తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

12న రగ్బీ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు

అనంతపురం: జిల్లా స్థాయి సబ్ జూనియర్ (అండర్–15 బాలికలు, బాలురు) రగ్బీ పోటీలు ఈ నెల 12న బత్తలపల్లిలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, డైరెక్టర్ కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2009, 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పూర్తి వివరాలకు 81066 74037, 97041 08321లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

వేతనాలు అందేలా చూడండి



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్య వివరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మలేరియా, గార్బేజ్, క్లాప్ కార్మికులకు వేతనాలు అందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఎస్సీ మునిసిపల్ కార్మికుల సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను మంగళవారం ఆయన చాంబర్ వద్ద సంఘం అధ్యక్షుడు అజయ్‌బాబు, గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షుడు సురేష్ బాబు, నాయకులు రాఘవ, నాగేష్, నాగన్న కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయి వేతనాల అంశంపై ఇప్పటికే నాలుగైదు దఫాలుగా విన్నవించినా నగర పాలక అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. కలెక్టర్ స్పందిస్తూ కమిషనర్‌తో మాట్లాడి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పద్మావతి



అనంతపురం అర్బన్: భారత జాతీయ మహిళ సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతిని ఎన్నికయ్యారు. ఆమె ఇప్పటికే సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు ఢిల్లీలో జరిగిన సమాఖ్య 22వ జాతీయ మహాసభల్లో తనను జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నుకున్నట్లు పద్మావతి తెలిపారు. తనపై నమ్మకంతో జాతీయస్థాయి కమిటీలో స్థానం కల్పించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

పంట భూముల సంరక్షణే లక్ష్యం



రామగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామగిరి: పంట భూముల రక్షణే టింబక్టు కలెక్టివ్ లక్ష్యమని ఆ సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు జేసీబీ వాహనంతో కాలువలు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 16 గ్రామాల్లో ఈ ప్రాజెక్ట్ పని జరుగుతోందన్నారు. ఈ పనులతో గ్రామాల్లో 220 ఎకరాల సాగులోకి రావడమేకాక ఆయకట్టు చివర ఉన్న పొలాలకు నీరు చేరుతోందన్నారు. అనంతరం సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. సంస్థ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, కాంచన, రవీంద్రప్రసాద్, ముత్యాలయ్య, నారాయణస్వామి, శెట్టిపల్లెప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఏపీఓపై ఫిర్యాదు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏపీఓగా పని చేస్తున్న నారాయణస్వామి తమను మానసిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు (సీఆర్పీ) వాపోయారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి ఫిర్యాదు చేశారు. బీఈడీ, టెట్ అర్హత కలిగిన తాము 13 ఏళ్లుగా పనిచేస్తూ విద్యా విషయక కార్యక్రమాలను పాఠశాల స్థాయికి తీసుకెళ్లి పూర్తి స్థాయి అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఓ నారాయణస్వామి తమను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు చేయాల్సిన వివిధ ఆన్‌లైన్ పనులను బలవంతంగా తమతో చేయిస్తున్నాడని వాపోయారు. సాయంత్రం 7 గంటల తర్వాత వెబెక్స్ నిర్వహించి సీఆర్పీలు ఏమి చేస్తున్నారు? రాత్రికి రాత్రే ఆన్‌లైన్ పనులన్నీ పూర్తి చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారన్నారు. ఈ మానసిక ఒత్తిళ్లతో మహిళా సీఆర్పీలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారులు ఎం.శివ కృష్ణ, శ్రావణి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. భోగినేపల్లి ఆశా కార్యకర్త అనిత, ఆమె కుటుంబ సభ్యులు దాదాపుగా 70 మంది హైరిస్క్ గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్స్ నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గీతా జయంతికి సర్వం సిద్ధం



పూజలందుకున్న రాధాకృష్ణులు



విద్యుద్దీపాలంకరణలో ఇస్కాన్ మందిరం

అనంతపురం కల్చరల్: గతి తప్పిన జగతిని ప్రగతి మార్గాన నడపడానికి గీతాచార్యుడైన శ్రీకృష్ణ భగవానుడు 'భగవద్గీత'ను లోకానికందించిన పవిత్రదినమే గీతాజయంతి. బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించడానికి నగరంలోని వేణుగోపాల స్వామి గుడి వంటి పలు వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. గీతామందిరంలో బుధవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు 18 అధ్యాయాల గీతాపారాయణం, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం, పల్లకీ సేవ జరుగుతాయి. ఇక నగర శివారులో ఇస్కాన్ మందిరంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు మందిర నిర్వాహకులు దామోదర గౌరంగదాసు మంగళవారం తెలిపారు. ఈనెల 16న 1008 మంది పాఠశాలల విద్యార్థులతో అర్జున విషాదయోగం, సాంఖ్య యోగం వంటి వాటిలోని శ్లోకాలను పారాయణం చేయిస్తామన్నారు. అనంతరం ప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. పారాయణంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రమందిస్తామని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సహించాలని కోరారు. ఇస్కాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9441563195 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చంద్రబాబు 'సూపర్' ఫెయిల్యూర్

- మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడిచినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు సూపర్ ఫెయిల్యూర్ అయ్యారని మేయర్ వసీం విమర్శించారు. మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాలు, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ తదితర పథకాల అమలుపై సీఎం చంద్రబాబు మాట్లాడాలన్నారు. అలివిగాని హామీలతో గద్దెనెక్కిన ఆయన వాటి అమలుపై మాట్లాడకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు చేస్తున్నారన్నారు. నేడు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండి ఉంటే అమ్మఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర పథకాలు తూచా తప్పకుండా అమలు చేసేవారన్నారు. పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతే వారికి అన్నదాత సుఖీభవను అందజేయలేదన్నారు. రైతాంగా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీకి కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని మేయర్ పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైఫుల్లాబేగ్, అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు జావెద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయిలో శిక్షణ తరగుతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. శిక్షణకు హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్యూటర్ పోస్టులు రద్దు చేయొద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: వైద్య కళాశాలలో ఒకేసారి 30 ట్యూటర్ పోస్టులు రద్దు చేయడంపై సీపీఎం జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు ఆర్‌వీనాయుడు, రామిరెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ వైద్యకళాశాలలో ఉన్న ట్యూటర్లను కర్నూలు ఆస్పత్రికి 22 మంది, తిరుపతి స్విమ్స్‌కు 8 మందిని బదిలీ చేశారన్నారు. వైద్య కళాశాల ఉనికికే ప్రమాదకరంగా 30 ట్యూటర్ పోస్టులను రద్దు చేయడంపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. వైద్య కళాశాలలో 83 ట్యూటర్ పోస్టులు, 200 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయన్నారు. ట్యూటర్లు వీరికి బోధన చేస్తూనే ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇలా పోస్టుల రద్దు చేయడం ద్వారా వైద్యసేవలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రిలో 1,200 పడకలకు పెంచి వైద్య సిబ్బందిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ముక్తాపురం రైతులు

కనగానపల్లి: రహదారుల పక్కన కల్వర్టులు, కాలువలను పూడ్చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాక్షిలో కల్వర్టులను పూడ్చేస్తున్న రియల్ వ్యాపారులు శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి బుధవారం పూడిక పనులు ఆపుచేయించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ దీనిపై స్థానిక రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. అనంతరం స్థానిక రైతులు నరసింహులు, గోవిందురెడ్డి, వెంకటనారాయణ, రామకృష్ణ సర్పంచ్ నారాయణతో కలసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే రియల్ వ్యాపారులను హెచ్చరించి పనులు ఆపేశామని, భూ ఆక్రమణలు, అక్రమంగా మట్టి తరలింపుపై కూడా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రైతులకు హామీఇచ్చారు. సీఎస్‌డీటీ కవిత, ఆర్‌ఐ సరళ, వీఆర్వో చెన్నకేశవులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

రామగిరి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ మీనుగ నాగమ్మ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే మండలం వెనుక బడి ఉందన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనుకుంటే అధికారులు, టీడీపీ నాయకులు సహకరించడం లేదన్నారు. సర్వసభ్య సమావేశాలు ఎన్ని జరిగినా అధికారుల తీరు మారడం లేదన్నారు. అభివృద్ధికి సహకరించకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీఓ ఆజాద్, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు



బుక్కచెర్ల రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు



పి.యాలేరులో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

రాప్తాడు: బుక్కచెర్లలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు తూతూమంత్రంగా సాగింది. అర్జీలు అందజేసేందుకు చాలా వరకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో చేసేది లేక అధికారులు తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సును ముగించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా అధికారులు మధ్యాహ్నం వరకే నిర్వహిస్తున్నారు. భోజనం చేసిన తర్వాత సదస్సు మొక్కుబడిగా సాగుతోంది. రైతులు ఎవరూ రావడం లేదని అధికారులే కబుర్లు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతులు ఇస్తే సమస్యలు పరిష్కరించని అధికారులు గ్రామాల్లో వినతులు ఇస్తే పరిష్కరిస్తారా అంటూ ప్రజలు బాహటంగానే చర్చించుకోవడం గమనార్హం. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, దేవదాయ శాఖ ఈఓ సుధారాణి, ఆర్‌ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వోలు సాయికుమార్, మనోజ్, సర్పంచు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు తీర్చేందుకే రెవెన్యూ సదస్సులు

చెన్నేకొత్తపల్లి: భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మేడాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. వాటిని విచారించి త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పులేటిపల్లిలో రెవెన్యూ సదస్సు

పులేటిపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు భూ సమస్యలపై వినతిపత్రాల ద్వారా తెలియజేయాలన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు

ఆత్మకూరు: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కరువైంది. సదస్సులపై కేవలం అధికార పార్టీ నేతలకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం పి.యాలేరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కేవలం 15 అర్జీలు రావడమే ఇందుకు నిదర్శనం. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపింది. కాని ఈ విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ సదస్సులకు సంబంధించి పూర్తిగా సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు సదస్సులకు హాజరు కాలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సదస్సుల సమాచారాన్ని ముందుగా తెలియడంతోపాటు తమను కూడా ఆహ్వానించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మానవ హక్కులు కాపాడుకుందాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ





నిర్వాహకులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ పుల్లారెడ్డి

అనంతపురం కల్చరల్: రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కులను కాపాడుకుందామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పీహెచ్‌ఆర్‌సీ (ప్రజా మానవ హక్కుల కమిటీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక లలితకళా పరిషత్తులో జరిగిన కార్యక్రమం ఆమె మాట్లాడారు. 1948 డిసెంబరు 10న మానవ హక్కుల దినంగా ప్రకటించారన్నారు. ప్రతి మనిషికి చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన ఉండాలనే లక్ష్యంతో మానవ హక్కువల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. అనంతరం ఆమె వివిధ క్రీడల్లో ప్రతిభచాటిని వారికి బహుమతులనందించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్రను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శర్మాస్‌వలి, ప్రజాబలం నాయకులు నజీర్, లావణ్య పాల్, సత్యనారాయణమ్మ, టీడీపీ నాయకులు మధు రాయల్, రమేష్ రాయల్, కర్ణాటక, ఆంధ్ర మానవ హక్కుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: ప్రాథమిక హక్కులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అమలుకు ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ప్రాథమిక హక్కులపై వక్తృత్వ పోటీలు నిర్వహించామని విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపేంద్రకుమార్, ప్రకాష్, పీడీఎస్‌యూ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఎస్కే యూనివర్సిటీ న్యాయశాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ పుల్లారెడ్డి మాట్లాడుతూ హక్కులను ఎలా కాపాడుకోవాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజనీతి శాస్త్ర సీనియర్ అధ్యాపకులు షఫీ మాట్లాడుతూ హక్కుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి కోసం పోరాటం చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు డాక్టర్ సి.రామాంజనేయులు, అంజనరెడ్డి, తిమ్మారెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బంగారు నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు



మాట్లాడుతున్న జువెలర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం రూరల్: బంగారు నాణ్యత, తూకం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని జువెలర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు శివప్రసాద్, గొంది నాగయ్య, సాలార్ బాషా, జనార్దన్ మాట్లాడుతూ స్వర్ణ కారులను ప్రోత్సహించి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. పెద్ద పెద్ద బంగారు మాల్స్‌ను ప్రోత్సహించేలా విజిలెన్స్ అధికారులు తమ షాపులపై దాడులు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైంది కాదన్నారు. నగరంలో ఎన్నో ఏళ్ల నుంచి ఖచ్చితమైన తూకంతో నాణ్యమై బంగారు అభరణాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. నగరంలో ఎన్ని మాల్స్ వచ్చినా ప్రజలు తమను ఆదరిస్తున్నారని, వాళ్ల నమ్మకాన్ని ఒమ్ము చేయకుంగా ఖచ్చితమైన తూకంతో పాటు నాణ్యమైన బంగారాన్ని అందిస్తామన్నారు. నాయకులు ఇలియాజ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా నాయకులు చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరులోని ప్రధాన రహదారిపై సీపీఐ నేతలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయక కార్యదర్శి శివ, రైతు సంఘం కార్యదర్శి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో నేడు వేలం

బుక్కరాయసముద్రం: జిల్లా జైలులో బుధవారం 25 వేల కేజీల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్‌రహ్మాన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కడప రేంజ్ ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం ముగిసిన తర్వాత డిపాజిట్ వెనక్కిస్తామని పేర్కొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

తాడిపత్రి రూరల్: సజ్జలదిన్నె వద్ద మంగళవారం ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షేక్ మహబుబ్‌బాషా, షేక్ చిన్న హాజీవలిని అరెస్టు చేసి రూ.25 వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

'పది' మోడల్ పేపర్ల ఆవిష్కరణ



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ పేపర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మోడల్ పేపర్లు తయారు చేసి ఇవ్వడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మెటీరియల్ తయారు చేయించి అతి తక్కువ ధరకు అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్ ఆదినారాయణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, నాయకులు దేవేంద్రమ్మ, చంద్రమోహన్, మహమ్మద్ జిలాన్, నాగేంద్ర పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మహిళా హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ బి. అనిత విద్యార్థినిలతో పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వసతి గృహాలను వీసీ సందర్శించారు. రీసెర్చ్ స్కాలర్లను ట్యూటర్లగా నియామకం చేశారు. ఇందుకు నలుగురిని ఎంపిక చేశారు. హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్ల పనితీరును సమీక్షించడానికి మెస్ సెక్రెటరీలు, వింగ్ లీడర్స్‌ను నియామకం చేశారు. బుధవారం నుంచి మెనూ రూపకల్పన చేసి, మెస్‌లో మెనూ బోర్డును అతికిస్తారు. వీటి ప్రకారం వంట చేస్తారు. దీంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ వార్డెన్ డాక్టర్ బి. జెస్సీ, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ వి.మాధవి, డాక్టర్ కే. అనిత, సంధ్య జ్యోత్స్న పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటు

పెద్దవడుగూరు: మండలంలోని కదదరగుట్టపల్లిలో ఉపాధ్యాయుడి నిర్లక్ష్యంతో ఒక విద్యార్థి విషపురుగు కాటుకు గురయ్యాడు. వివరాలు.. పాఠశాలలో పది మందిలోపు పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో బయట ఆడుకుంటున్న నాలుగో తరగతి విద్యార్థి గౌతమ్ కాలుకు విష పురుగు కాటు వేసింది. ఉపాధ్యాయుడు వెంటనే విద్యార్థిని తీసుకుని మిగిలిన వారిని బయటే వదిలేసి పాఠశాలకు తలుపులు వేసి వెళ్లిపోయాడు.

హనుమాన్ మాలధారులకు గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో ఢీకొని ముగ్గురు హనుమాన్ మాలధారులకు గాయలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రి నుంచి గుంతకల్లు మండలం కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న మాలధారులను ఆటో ఢీకొంది. ఘటనలో మాలధారులు చంద్ర, అజేయ్, మహేంద్రకు గాయాలయ్యాయి. వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.